ప్రజాశక్తి
శనివారం 21 జనవరి 2023 5
శ్రీ సత్యసాయి





హిందూపురంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న విద్యార్థి, యువజన, ప్రత్యేక హోదా సాధన సమితి, ప్రజా సంఘాల నాయకులు

హోదాతోనే భావితరాలకు భవిష్యత్తు

◆ బిజెపి మోసంతో రాష్ట్రానికి తీరని నష్టం

◆ మోడీని ఎదిరించలేని స్థితిలో జగన్మోహన్‌రెడ్డి

◆ ప్రశ్నించకుంటే ప్రజాద్రోహులుగా చంద్రబాబు, పవన్

◆ హోదా కోసం చేసే ధర్మయుద్ధంలో అందరూ పాల్గొనాలి

◆ ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విభజన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి తీరని అన్యాయం చేసిందని, దీనిని నిరసిస్తూ భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమం సాగించాల్సిన అవసరం ఉందని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'ప్రత్యేక హోదా–ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో శుక్రవారం ఉదయం విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగసభ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి గురునాథ్ సర్కిల్ వరకు 'ప్రత్యేక హోదా..ఆంధ్రుల హక్కు, విభజన చట్టాన్ని అమలు చేయాలని' నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మధు, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘాల రాష్ట్ర నాయకులు సాకే నరేష్ తదితరులు పాల్గొన్నారు. హోదా విషయలో బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు అనుసరిస్తున్న మోసాన్ని ఎండగట్టారు.

హోదా ఉద్యమాన్ని అడ్డుకుంటే చరిత్ర హీనులే..
చలసాని శ్రీనివాస్

ప్రత్యేక హోదా కోసం చేపట్టిన ఉద్యమాన్ని జీవోల పేరుతో అడ్డుకునే వారు భవిష్యత్తులో చరిత్ర హీనులుగా మిగిలిపోతారని చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో ప్రత్యేక హోదా–విభజన హామీలకై చేపట్టిన బస్సుయాత్రకు అనుమతి ఇవ్వకుండా రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ వైసిపికి కొమ్ముకాయడం సరికాదన్నారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన బస్సుయాత్ర రాష్ట్ర భవిష్యత్తు కోసమే అన్నారు. దీనికి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన మద్దతు ఇవ్వాలన్నారు. నాడు టిడిపి ప్రత్యేక హోదా కోసం తలపెట్టిన ధర్మపోరాట దీక్షలో స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తొడగొట్టి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల కోసం శపథం చేశారని, అదే శపథంతో ప్రస్తుత ఉద్యమంలో పాలుపంచుకోవాలన్నారు. పవన్ కళ్యాన్ బీజేపీ చెర నుంచి బయటకు వచ్చి హోదా కోసం ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో ఉండే అన్ని రాజకీయ పార్టీలు ప్రజల వైపు ఉంటారా.? గుజరాతీ మార్వాడీల వైపు ఉంటారా..? అన్నది తేల్చుకోవాలన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం చేపట్టిన యాత్రకు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు.

బిజెపి పాలనలో రాష్ట్రానికి అడుగడుగునా అన్యాయం
సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, పోలవరం తదితర అన్ని విషయాల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు పి.మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేశారన్నారు. పార్లమెంట్ సాక్షిగా 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని బిజెపి నిలుపుకోకుండా ద్రోహం చేసిందన్నారు. ప్రత్యేక హోదా విషయంలో బిజెపిని నిలదీయాల్సిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మౌనంగా ఉన్నారన్నారు. హోదా కోసం విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు బస్సుయాత్ర చేపడితే దీనిని అడ్డుకునేలా జగన్ ప్రభుత్వం జీవోలు తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి మోడీకి మోకరిల్లుతూ రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు నష్టం అని తెలిసినా కేంద్రం అమలు చేస్తున్న నల్ల చట్టాలను రాష్ట్రంలో అమలు చేయడానికి తహతహలాడుతున్నారన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం తన తప్పును తెలుసుకుని యువజన, విద్యార్థులు రాష్ట్ర భవిష్యత్తు కోసం తలపెట్టిన బస్సుయాత్రకు అనుమతులు ఇవ్వాలని కోరారు. లేదంటే జగన్మోహన్‌రెడ్డి ప్రజాద్రోహిగా చరిత్రలో నిలచిపోతారన్నారు. ప్రతిపక్ష టిడిపి, జనసేన సైతం బిజెపిని ప్రశ్నించకుండా మౌనంగా ఉన్నాయన్నారు. ఈ పార్టీల్లో మార్పు రాకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని తెలియజేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు వారి అజెండాలను పక్కన బెట్టి ప్రత్యేక హోదా ధర్మయుద్ధంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. బస్సుయాత్రకు అనుమతి ఇవ్వాలని తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, తప్పకుండా అనుమతి వస్తుందని చెప్పారు. ప్రత్యేక హోదా సాధన కోసం తాము చేపట్టిన బస్సుయాత్రను ఆపే ప్రసక్తే లేదన్నారు.

హోదా ఉద్యమం ఆగదు..
విద్యార్థి, యువజన సంఘాలు

ప్రత్యేక హోదా కోసం ప్రస్తుతం చేపట్టిన ఉద్యమం ప్రారంభం మాత్రమే అని, ఇది ఆగదని రాష్ట్ర వ్యాప్తంగా దీనిని కొనసాగిస్తామని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అద్యక్షులు కె.ప్రసన్న కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ న్యాయస్థానం అనుమతి ఇచ్చిన వెంటనే హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు బస్సుయాత్ర చేపడుతాం అన్నారు. హోదా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రత్యేక హోదా కోసం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఈ యాత్ర ఓట్లు.. నోట్లు... అధికారం కోసం చేస్తున్నది కాదని రాష్ట్రం భవిష్యత్తు కోసం అన్నారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే వెంకన్న సాక్షిగా ఇచ్చిన హోదా హామీని అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో యువజన, విద్యార్థులు కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు బాబావలి, రాజేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, హర్షకుమార్, చంద్రశేఖర్, మూర్తి, పవన్, భగత్, అబి, మహేష్, కార్మిక సంఘం నాయకులు నరసింహులు, వినోద్ కుమార్, శివప్ప, ఇస్మాయిల్, రాజప్ప, శివప్ప, రాముతో పాటు పెద్ద ఎత్తున యువజన, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు అదుపులో ఉన్నప్పుడే అభివృద్ధి



విలేకరులతో మాట్లాడుతున్న డిఐజి రవిప్రకాష్

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమైతుందని అనంతపురం రేంజ్ డిఐజి రవి ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన శ్రీ సత్య సాయి జిల్లా పోలీస్ ఎఆర్ విభాగాన్ని తనిఖీ చేశారు. అనంతరం పుట్టపర్తి పరేడ్ మైదానంలో ఎఆర్ సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించి, జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ తో కలసి పరేడ్ ను సందర్శించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ పోలీసులు ఎప్పుడూ ప్రతికూల పరిస్థితుల్లో పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయనీ, అప్పుడే ప్రజలు హర్షిస్తారని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ బాగా ఉన్నప్పుడే అభివద్ధి సాధ్యమవుతుందన్నారు. పరేడ్ లో మంచి ప్రతిభ కనపరిచిన జిల్లా పోలీస్ వాయిద్య బృందానికి డిఐజి నగదు రివార్డు అందజేశారు. జిల్లా ఏఆర్ విభాగం తనిఖీచేసి పలు సూచనలు చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ కాన్ఫరెన్స్ హాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఎఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు శ్రీశైలరెడ్డి, టైటాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జీఆర్పీ ఎస్ఐగా గోపీకృష్ణ బాధ్యతల స్వీకరణ



రైల్వే జీఆర్పీ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న గోపీకృష్ణ

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వే జీఆర్పీ ఎస్ఐగా గోపీకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నాగప్ప ఏడాది క్రితం గుత్తికి బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈనేపథ్యంలో పుట్టపర్తి అర్బన్ ఎస్ఐగా పనిచేస్తున్న గోపీకృష్ణను రైల్వే జీఆర్పీ ఎస్ఐగా బదిలీ చేశారు. దీంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ రైల్వే ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతామన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సచివాలయ క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

హిందూపురం : గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భీమిరెడ్డి, అంజన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూపూర్ మున్సిపల్ సచివాలయ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జెఎసి అధ్యక్షులు బండి ఆనంద రాజు, జిల్లా అధ్యక్షులు సిరాల చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, హిందూపూర్ అర్బన్ ప్రెసిడెంట్ జెపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై సమీక్ష

పుట్టపర్తి రూరల్ : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని పనితీరుపై సమీక్ష సమావేశాన్ని శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కృష్ణారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు విడుదలైన నిధులు, వాటి జమఖర్చుల గురించి, సింగిల్ నోడల్ అకౌంట్ గురించి సమీక్షించారు. ఈసందర్భంగా సత్యసాయి జిల్లా ఏపీ మెడికల్ హెల్త్ మినిస్టర్ సర్వీస్ అసోసియేషన్‌న ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సీనియర్ అసిస్టెంట్లు, ఎన్‌హెచ్ఎం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి ఇన్‌ఛార్జి విసిగా విజయకుమార్

అనంతపురం : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా అనంతపురం జెఎన్‌టియు రెక్టార్ ఎం.విజయకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు. విద్యార్థులకు అన్ని రకాలుగా అందుబాటులో ఉండి విద్యాభివద్ధికి కషి చేస్తానని తెలిపారు. ఇన్‌ఛార్జ్ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన విజయకుమార్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఆర్‌జియు ఛాన్సలర్ కెసి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు.

రైతాంగాన్ని నట్టేట ముంచిన కేంద్రం

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం - 26న జిల్లాలో నిరసన ర్యాలీ - ఎపి రైతుసంఘం నాయకులు



రైతు ట్రాక్టర్ల ర్యాలీ పోస్టర్లను విడుదల చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ కమిటీ నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు విమర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా లో ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా రైతులతో ట్రాక్టర్లు, బైకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల నాయకులు ప్రకటించారు. స్థానిక శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ దగ్గర జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు జంగాలపల్లి పెద్దన్న బడా సుబ్బిరెడ్డి, జిల్లా సెక్రటరీ జెవి రమణ, కెకె ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. గిరీష్, సిఐటియు నాయకులు రామకృష్ణ, లక్ష్మీనారాయణ, పైపల్లి గంగాధర, గౌస్ లాజం ,బి గంగాధర, రైతు సంఘం జిల్లా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, సంజీవ్ రాయప్ప, భీమన్న, కె.వి చలపతి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రిపబ్లిక్ డే రైతు ట్రాక్టర్ల ర్యాలీ పోస్టర్లను రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమం ఫలితంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసగించిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి ఫార్ములా ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మద్దతు ధరలు రైతులకు అందేలా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం వెంటనే తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలకు చట్టబద్ధత లేక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించకపోవడం అన్యాయమన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీ చేస్తున్న కేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల పంట రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపు కార్యక్రమాన్ని ఆపాలని కోరారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో అమరులైన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. రైతులపై బనాయించిన అక్రమ కేసులు రద్దు చేయాలన్నారు. జిల్లాలో రైతుల ధాన్యం కొనుగోలులో వస్తున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా మామిళ్ళకుంట్లపల్లి క్రాస్ నుండి గణేష్ సర్కిల్ వరకు సత్యసాయి జిల్లా రైతులు, కార్మికులు నిర్వహిస్తున్న రైతు బైకు ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న డిఐజి రవిప్రకాష్

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి : డిఐజి

కదిరి అర్బన్ : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కొరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని డిఐజి రవి ప్రకాష్ తెలిపారు. పోలీసు విభాగాల వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం డిఐజి రవి ప్రకాష్ కదిరి స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా.పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణంలో డిఐజి, ఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఐజి మాట్లాడుతూ మట్కా, జూదం ,డ్రగ్స్ పై ,యువతకు ,విద్యార్థులకు అవగాహన చాలా అవసరమన్నారు. రోడ్డు ప్రమాదాలు డ్రగ్స్ అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ భవ్య కిషోర్, సిఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్



రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రోడ్డు ప్రమాదాల నివారణ జరగాలంటే రోడ్డు భద్రత నియమాలు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక గణేష్ సర్కిల్ లో రోడ్డు ప్రమాదాలు, పాటించవలసిన నియమ నిబంధనలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గణేష్ సర్కిల్ నుంచి గోకులం మీదుగా సత్యమ్మ గుడి వరకు 3కెఎం వాక్ దన్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, డీఎస్పీ యశ్వంత్, ఎస్పి డిఎస్పి ఉమామహేశ్వర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని మోటార్ వాహనాల తనిఖీ అధికారి వరప్రసాద్ కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కదిరి పట్టణంలో కాలేజీ సర్కిల్ ,అంబేద్కర్ సర్కిల్‌లో వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు. వాహన చోదకులకు కరపత్రాలు పంపిణీ చేసి రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పోలీసులు, వాహనదారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

హిందూపురం : వాహనాదారులు తప్పని సరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా రవాణ శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రవాణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ వీధుల్లో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.. అనంతరం పాఠశాల, క్యాబ్ డ్రైవర్లకు కంటి పరీక్షలను కార్యాలయ ఆవరణంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు అయిషా, గోవర్ధన్ రెడ్డి, సిబ్బందితో పాటు ఎంవిఐలు రమణ, శివశంకర్, జయశ్రీ యాదవ్, ఎఒలు జాన్‌పాల్, ఇనాయతుల్లా, ట్రాఫిక్ ఎస్ఐ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎంబిఐడిఎస్ ఎం. వరప్రసాద్ కోరారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఆటో డ్రైవర్లతో కదిరి ఎంబిఐడిఎస్ఎం వరప్రసాద్ ఆటో డ్రైవర్ తో అవగాహన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు ఎస్ఐ రమణారెడ్డి రామయ్య, భాస్కర్, రాజు సిబ్బంది, కృష్ణమూర్తి, ఆటో యూనియన్ నాయకులు ఎం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పంటసాగులో విత్తన నాణ్యతే కీలకం

నంబులపూలకుంట : పంటసాగు, అధిక దిగుబడికి విత్తన నాణ్యతే కీలకమని ఎడిఎ సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని ధనియాల చెరువు గ్రామంలోని రైతుల పొలాల్లో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఎడిఎ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన పంటసాగుతో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ లోకేశ్వర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నారాయణస్వామి, నరసింహా రెడ్డి యుగంధర్, ధనలక్ష్మి, స్వర్ణలత, కృష్ణానాయక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బుక్కపట్నం : గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి శ్రీధర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గోనిగారి పల్లి పంచాయతీలో నూతన తాగునీటి పథకం పైప్ లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో పాత పైపులైన్ పాడైపోవడంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నూతన పైపులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోవిందరెడ్డి, జెఇ శర్మ వైసిపి నాయకులు పుల్లారెడ్డి, శేఖర్, ప్రదీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

నల్లచెరువు : మండల పరిధిలోని వివిధ పాఠశాలలను ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి శుక్రవారం సందర్శించారు. దేవి రెడ్డిపల్లి వద్ద గల మోడల్ పాఠశాలను సందర్శించిన ఆమె మాట్లాడుతూ పాఠశాలలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని సిజి ప్రాజెక్టు వద్ద గల గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్నిఎమ్మెల్సీ కల్పలత రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో ముచ్చటిస్తూ పాఠశాలలోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనందించుచున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాలగుడి వెంకటేశ్వర నాయుడు, ఉపాధ్యాయులు బోధన సిబ్బంది, విద్యార్థినిలు, పాల్గొన్నారు.

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి

కొత్తచెరువు : విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తచెరువులోని బాలికల, బాలుర, తలుపుల ఉన్నత పాఠశాలలను ఆయన శుక్రవారం పరిశీలించారు. గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎ 1 పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు, ఈ కార్యక్రమంలో డిఇ మీనాక్షి, ఎంఇఒ వెంకటరమణ నాయక్, హెచ్ఎంలు చెన్న కృష్ణారెడ్డి, సుమన, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర : పట్టణంలోని సబ్ స్టేషన్‌లో ఏర్పడిన సాంకేతిక, యాంత్రీకరణ సమస్యతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ మహేంద్ర తెలిపారు.ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : నూతన జిల్లాలో వివిధ ప్రభుత్వ భవన నిర్మాణాలకు స్థల సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పుట్టపర్తి పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ భవనాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. ఎనుములపల్లిలో ప్రభుత్వ ప్రభుత్వ భూములను గుర్తించారు. పెరేడ్ గ్రౌండ్ వద్ద గల ప్రభుత్వ భూములు, నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలను, షాదీ మహల్ దగ్గర ఉన్న 11 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. రెడ్ క్రాస్ భవన నిర్మాణానికి, రైతు బజారు, స్కిల్ డెవలప్మెంట్, టూరిజం భవన నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణకు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం 26న గణతంత్ర దినోత్సవ వేడుకలకు పేరేడ్ గ్రౌండ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి రామకృష్ణ ప్రసాద్, తహశీల్దార్ నవీన్ కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుడా విసి నవీన్‌కృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీ అధికారి విశ్వనాథరెడ్డి, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే ఇబ్బందులే....



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

సోమందేపల్లి : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే ఇబ్బందులు తప్పవని జిల్లా హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మండల పరిధిలోని చాకర్లపల్లి వద్ద జగనన్న లే అవుట్‌ను శుక్రవారం పరిశీలించి లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జగనన్న లే అవుట్ కింద ఇక్కడ 2020 సంవత్సరంలో గృహాలు మంజూరయ్యాయన్నారు. 2 సంవత్సరాలు పూర్తయిని ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేదన్నారు. చాలామంది ఇళ్ల నిర్మాణం పై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కాలనీలో విద్యుత్ సౌకర్యానికి నెలాఖరు లోపు చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణ పనులు చేపట్టని లబ్ధిదారుల పట్టాలు రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని అందుకు అందరు సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజనీర్లతో సమావేశమై లబ్ధిదారులతో గృహాలు నిర్మించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఎఇ నారాయణ రెడ్డి, సచివాలయ ఇంజనీర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : లబ్ధిదారులు మంజూరైన గృహాల నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది పండుగకు గృహ ప్రవేశాలు చేయడమే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపిపి తుమ్మల ఫర్వీన్ షామీం, అగ్రికల్చర్ అడ్వైజర్ చైర్మన్ లక్ష్మిరెడ్డి పెర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అల్లాపల్లి పంచాయతీ సచివాలయంలో గృహ లబ్ధిదారులకు సిమెంట్ మంజూరు పత్రాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ హరినాథ్ రెడ్డి, తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఒ పోలప్ప, సర్పంచి వెంకటరమణ, సచివాలయం కన్వీనర్ ఆనంద్ రెడ్డి తదితరులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే లోకేష్ పాదయాత్ర : టిడిపి

బుక్కపట్నం : సమస్యల పరిష్కారంపై ప్రభుత్వంతో పోరాడడానికే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పేరుతో పాదయాత్ర చేపట్టారని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో యువగళం పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించి స్థానిక చౌడేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. యువగళం పేరుతో ఈనెల 27 నుంచి నారా లోకేష్ చేపట్టే పాదయాత్రలో యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయగూరల చంద్ర, సామకోటి ఈశ్వరయ్య, షామీర్‌బాషా, వాజిద్, సాదిక్ వలి, తెలుగు యువత నాయకులు సుధీర్ , రఘు, వాసిం, అక్రమ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయదారుల అరెస్టు

ధర్మవరం టౌన్ : అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచుకుని విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బోయవీధిలో ఉన్న కూరగాయలు దుకాణంలో మద్యాన్ని నిల్వ ఉంచి అమ్ముతున్నట్టు అందిన సమాచారంతో సిబబందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా మద్యం విక్రయిస్తున్న పార్వతిబాయి, వెంకటేష్‌నాయక్‌ను అదుపులోకి తీసుకుని 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు నిందితులకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మట్కా స్థావరాలపై దాడులు

హిందూపురం : సెబ్ సిఐ లక్ష్మీదుర్గయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో మెరుపు దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి మట్కా స్లిప్పులు, రూ.38,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఆహ్మద్ నగర్ కు చెందిన జబివుల్లాను అదుపులోకి తీసుకుని ఇతని నుంచి రూ.6.500 నగదుతో పాటు 13 స్లిప్పులు, ఒక సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ చెప్పారు. అదే విధంగా హస్నాబాద్ లో చికెన్ రియాజ్ ను అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.8.300 నగదు, 11 మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోట్నూరులో నాగభూషణం అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్నా 40 మట్కా స్లిప్పులు, రూ.38,400 నగదుతో పాటు మూడు సెల్ ఫోన్‌లను స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు.

వాటర్ ప్లాంట్లపై దాడులు

హిందూపురం : విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆహార భద్రత అధికారులు సంయుక్తంగా శుక్రవారం పట్టణంలోని వాటర్‌ప్లాంట్లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడేశ్వరి కాలనీలో ఉన్న రఫీక్ వాటర్ ప్లాంట్, షిర్డీసాయి నగర్‌లో ఉన్నా లహరి వాటర్ ప్లాంట్‌లో నీటిని సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సాయిప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతు వాటర్ ప్లాంట్లలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో ఆహార భద్రత అధికారులతో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆహార భద్రత అధికారిణి తస్లీం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

వైసిపి ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతాం

ధర్మవరం టౌన్ : వైసిపి ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అరాచకపాలన, దాడులు, కబ్జాలు ఎక్కువయ్యాయన్నారు. అంతేకాక ప్రశ్నించే వారిపై కేసులు బనాయించి బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఇదంతా ప్రజలు గమనించి విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా తగిన బుద్ధి చెబుతారన్నారు. కాదా ఈనెల 24న మాజీమంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేష్‌చౌదరి, ఫణికుమార్, పోతుకుంట లక్ష్మన్న, పురుషోత్తంగౌడ్, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, రాంపురం శీన, అంబటి సనత్, పోతుకుంట రమేష్, చిత్రా రామ్మోహన్, చిన్నూరు విజయ్‌చౌదరి పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరు కావాలి

బత్తలపల్లి : మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకావాలని ఎంపిపి గుర్రం వనజ, ఎంపిడిఒ సాయిమనోహర్ సూచించారు. శుక్రవారం మండలంలోని తంబాపురం గ్రామ సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విధుల్లో భాగంగా బయటకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా రాయాలన్నారు. అంతేగాకుండా ఉద్యోగులందరూ సమన్వయంతో, ఐక్యతతో పని చేయాలన్నారు. కాగా ఓటరు జాబితాలో ఆధార్ నెంబర్ నమోదు ఎంత వరకు వచ్చిందని బిఎల్‌ఒలను అడిగి తెలుసుకున్నారు. అనవసరంగా ఎవరి ఓట్లును తొలగించవద్దన్నారు. రెండు చోట్ల ఓటరుగా నమోదు చేసుకున్నవారు ఉంటే వారు ఎక్కడ ఉంచుకుంటారో తెలియజేసి తొలగించాలని సూచించారు. మండలంలో రెండు చోట్ల ఓటరుగా నమోదు చేసుకున్నవారి సంఖ్య అధికంగానే ఉందన్నారు. ఈ సమావేశంలో సర్పంచు సానే జయచంద్రారెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, నాయకులు రామ్‌భూపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, సంద్రా రామకృష్ణతోపాటు పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

ఓంకారేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బత్తలపల్లి : మండల కేంద్రంలో వెలసిన శ్రీలలిత త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామునే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని పూలతో అలంకరించి శివదీక్షాపరులు భజనలు చేశారు. తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ శాశ్వత ధర్మకర్త, ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ మాట్లాడుతూ మూడు రోజులు పాటు నిర్వహించే ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఇళ్ల లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలి

ధర్మవరం టౌన్ : జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణ సమీపంలోని రేగాటిపల్లి లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఇంటి నిర్మానానికి ఎంత ఖర్చు అవుతోంది.. ప్రభుత్వం నుంచి ఎంత వస్తోందనే విషయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు కేవలం రూ. రూ.1.80లక్షలు మాత్రమే ఇస్తోందన్నారు. ఈ మొత్తం పునాదులకే సరిపోతోందన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, సిపిఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, నాయకులు శ్రీదర్, శంకర, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి విరాళం

హిందూపురం : పట్టణంలోని నానేప్పనగర్‌లో నూతనంగా నిర్మాణం చేస్తున్న శ్రీ వీరభద్రస్వామి అన్నదాన సత్రానికి కొండూరు వేణుగోపాల్‌రెడ్డి కుటుంబం భారీ విరాళం అందజేసింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతు తన తల్లిదండ్రులు అశ్వర్థమ్మ, నారాయణరెడ్డిల జ్ఞాపకర్థం లేపాక్షిలో నిర్మాణం చేస్తున్న అన్నదాన సత్రానికి తన వంతుగా రూ.2,22,222లను తన తల్లి చేతుల మీదుగా అందించానన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి సోదరి సరస్వతమ్మ, లేపాక్షి వైస్ ఎంపీపీ అంజిన రెడ్డి, రామాంజనేయులు, రాంప్రసాద్, వీరన్న, ఆనంద్ రెడ్డి, హిందూపురం బసప్ప, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల కంపల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

రొద్దం : మండలంలోని దొడగట్ట గ్రామంలో హైస్కూల్ సమీపంలో ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ నియంత్రిక చుట్టూ ఉన్న ముళ్లకంపలను తొలగించారు. పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ నియంత్రికకు చుట్టూ పక్కల పెరిగిన కంపచెట్లు, తీగమొక్కలను విద్యుత్ అధికారులు తొలగించారు.



కంపలు తొలగించిన దృశ్యం

దశాబ్దాల కాలంగా అన్ని విధాలా నష్టపోయాం



శ్యాముల్ ఆనంద్‌ను సన్మానిస్తున్న నాయకులు

కదిరి టౌన్ : ఆంధ్రప్రదేశ్ లోని బోయలు దశాబ్దాల కాలంగా అన్ని విధాలుగా నష్టపోతున్నామని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఏక సభ్య కమిషన్ శ్యాముల్ ఆనంద్‌ను కలిసి సమస్యను వివరించారు. రాష్ట్రంలో రాజకీయ, ఉద్యోగాల పరంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి బోయల స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, గతంలో వివిధ కమిషన్లు ఇచ్చిన నివేదికలు, ఇతర రాష్ట్రాల వాల్మీకి బోయల స్థితిగతులు, వారికి జరిగిన నష్టాల గురించి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ జక్కుల శ్రీనివాసరావు , జాయింట్ సెక్రటరీ నల్లబోతుల మల్లికార్జున, రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్ సాంబ శివ , శ్రీ సత్య సాయి జిల్లా ప్రధాన కార్యదర్శి వాల్మీకి మేకల శివ ప్రసాద్, విజయవాడ లాయర్ రాజేశ్వరి , నల్లమాడ రవీంద్ర, హిందూపూర్ వెంకటేష్ పాల్గొన్నారు

'వ్యక్తిగత దూషణలను సహించం'

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మహిళకు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని ముఖ్యమంత్రి ఇస్తే, కొంత మంది సహించకుండా వ్యక్తి గత దూషణలకు పాల్పడుతున్నారని దీనిని సహించేది లేదని వాల్మీకి సంఘం నాయకులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని వాల్మీకి భవన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు మాట్లాడారు.గత వారం మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో సొంత పార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ ఇంద్రజపై దురుసుగా ప్రవర్తించి, అసభ్య పదజాలంతో దూషించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కొంత మంది కౌన్సిలర్లు వారికి సంబందం లేని విషయాల్లో సైతం కలగజేసుకుని, వాల్మీకి మహిళా అని చూడకుండా అసభ్య పదజాలంతో దూషించడం సరికాదన్నారు. సంబందం లేని విషయాల్లో సైతం కలగజేసుకుంటూ సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావతమైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ సమావేశంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య, నాయకులు బిఎన్ మూర్తి, ముద్దరంగప్ప, ఆదినారాయణప్ప, శ్రీనివాసులు, నాగరాజు, రవిబాబు, వైటిపి శ్రీనివాసులు, వినయ్‌కృష్ణ, లోకేష్, చిరంజీవి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొత్తచెరువు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మైల్ సముద్రం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల సక్రమంగా ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రీ రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి. సర్పంచి ఇందిరమ్మ డాక్టర్ నరసింహారెడ్డి వైసీపీ నాయకులు వాల్మీకి శంకర్, నాగరాజు, నరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల : పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే శంకర్ నారాయణ తెలిపారు. మండలంలోని మల సముద్రం, కోరేవాండ్లపల్లి, పూల చెట్ల పల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటిం టికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప యాదవ్ ఎంపీపీ ప్రమీల జడ్పిటిసి జయరాం నాయక్ సింగల్ విండో ఛైర్మన్ శివశంకర్ రెడ్డి, బయపురెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి తదితరులతో పాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల కేంద్రంలోని ఒకటవ వార్డు సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలకు చేరువ చేయడానికి సచివాలయ సిబ్బందిని, వాలెంటరీ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, కొక్కంటి శ్రీనివాసులు నాయుడు, దేశాయ్ భక్తవత్సలరెడ్డి, శ్రీకంఠ రెడ్డి, గణేష్ రెడ్డి, రామ్ దేశాయ్, సర్పంచి భర్త రామకృష్ణ, హేమ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దౌర్జన్య పాలన : టిడిపి

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఈ పాలనకు స్వస్తి పలకాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎనుములపల్లి సమీపంలో గల శిల్పారామం కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు ఎల్ఐసి నర్సింహులు, సామకోటి ఆదినారాయణ, మహమ్మద్ రఫీ, గూడూరు ఓబులేసు, దయ్యాల ఉమాపతి యాదవ్, ఆవుల సుబ్రహ్మణ్యం, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



మడకశిరలో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

మడకశిర : వైసీపీ ప్రభుత్వం గడిచిన మూడున్నర సంవత్సరాల కాల వ్యవధిలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం ప్రాజెక్టులు భవనాల శంకుస్థాపనలకు, ప్రచారాలకే పెద్దపీట వేసిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. మండల పరిధిలోని హరే సముద్రం పంచాయతీ పరిధిలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా గుండుమల మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లన్నీ గుంతల మయంగా మారాయన్నారు. ఈ అరాచక పాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తితోపాటు నాయకులు రఘురాం, లక్ష్మీనారాయణ, మనోహర్, భక్తర్‌తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.